# 14. ఇంతే సంగతులు

అయిదింటికి, అయిదు నిముషాల ముందుగానే ఫైళ్ళన్నీ కట్టకట్టి, పైనపెట్టి, బాత్‌రూమ్‌లోకి వెళ్ళి, రోజంతా చేసిన వెధవ పనివల్ల చేతుల కంటిన పాపం కడుక్కొని, బయటకు అడుగుపెట్టాను ఆఫీసులోంచి. ఇంటికెళ్ళి ఏం చేయాలి తను? ఏమీ తోచదు. సుభద్రా వాళ్ళ ఇంటికి వెళ్ళిపోయాక నా కున్నదంతా ఖాళీ టైమే. ఇంతకు పూర్వమే...

ఆ రోజులు మళ్ళీ రావు.

ఈ సారి సుభద్ర ఒంటరిగా రాదు. మా యిద్దరి మధ్యకూ ఒక పిల్లనో, పిల్లవాణ్ణో పట్టుకొస్తుంది. కొంపతీసి ఇద్దర్ని పట్టుకొస్తే హాతోస్మి!!

సినిమాకు వెడదామనిపించింది. కానీ దానికైనా ఇంకా చాలా టైముంది. ఒంటరితనం భరించలేనిదయింది. జంట ఇంట్లో లేకపోయినా, యింటికే వెళ్ళాల్సి వస్తోంది.

ఇల్లు తాళంతీసి లోపలకు వెడుతోంటే పోస్ట్‌మాన్ పారేసిన ఉత్తరాలు కనిపించాయి. ఒకటి సుభద్ర రాసింది—కులాసాయేనట. ఇంకా 'ఆ' సూచనలేవీ లేవుట. పెళ్ళిగ్రాం రాగానే బయల్దేరి రాకపోతే ఒట్టంది. హోటల్‌కూడు పడకపోతే ఇంట్లోనే 'ఇంత' వండుకోమంది. మరేమీ ఫర్వాలేదుట. నా కెందుకో మనసంతా ఆనందంతో నిండిపోయింది.

రెండోది శుభలేక—విప్పాను.

వీర్రాజు పెళ్ళి!!

—ఆశ్చర్యపోయాను, వధువు పేరు కరుణ. అంటే శకుంతల కాదన్నమాట!!

వీర్రాజు పెళ్ళంటే చాలా సంతోషించాల్సిన విషయం. నిజమే,

కానీ ఈవేళ నా మనసులో సంతోషం లేనేలేదు. సుభద్రరాసిన ఉత్తరం చదివాక నాలో చెలరేగిన ఆనందం కూడా ఈ క్షణంలో నాలో లేనేలేదు.

కారణం?

వధువు, శకుంతల కాకపోవటమే!!

వీర్రాజు ఉత్త రాస్కెల్, ఇడియట్!!

'ఈవిడ పేరు శకుంతలరా; అన్నాడు వీర్రాజు. నేను ఆవేళ అసెంబ్లీ దగ్గర చెట్లకింద బస్సుకోసం వెయిట్ చేస్తోంటే, ఓ జంట వస్తోంటే, అందులో ఒకరు వీర్రాజు అని గుర్తించిపిలిచాక, రెండో వ్యక్తిని పరిచయం చేస్తూ వీర్రాజు చెప్పిన పరిచయ వాక్యాలివి.

శకుంతలకేసి చూశాను—మనిషి ఆకర్షనీయంగనే ఉంది. మరీ కొట్టవచ్చేటట్లు కనిపిస్తోంది ఆమెలోని ఆ నిరాడంబరత్వం. చాలా సేపు ఆమెను చూడాలనిపించినా అలా ఆమెని చూస్తే బాగుండదని తల తిప్పు కొన్నాను. నెమ్మదిగా అడిగాను వీర్రాజును-'ఈ మధ్య కనబడ్డంలేదేంరా?'

నవ్వాడు—ఆ నవ్వులో వీర్రాజు చెప్పబోతున్న అబద్ధపుఅంచులు కనబడుతూనే ఉన్నాయి. "కొంచెం బిజీగా ఉండి..."

వీర్రాజు చెప్పని మిగతాదంతా నా కర్థమయింది. నవ్వాను.

శకుంతల ఇబ్బందిగా కదిలింది. అదీ నా కర్థ మయింది. వాళ్ళను ఆ బాధనుండి రక్షిస్తూ అన్నాను—"ఆదివారం రండిరా ఇంటికి! మీరు కూడా రండి ఇంటికి" అన్నాను శకుంతలకేసి చూస్తూ, ఆహ్వానిస్తూ.

ఇద్దరూ వస్తామనే అన్నారు.

—కాని రాలేదు. ఆదివారం మామూలుగా లేటుగా లేచేవాడిని. ఆవేళ కొంచెం తొందరగా లేచి, ఇల్లంతా శుభ్రంగా తుడిపించి, ఇంటికి కొత్త అందాలు తేవడానికి ప్రయత్నించి, వాళ్లకోసం రెండింటిదాకా పడి గాపులు పడ్డ నాకు ఆశాభంగమే కలిగింది.

ఆ రోజు సాయంత్రమే నాలుగింటికి, మళ్లీ అసెంబ్లీ దగ్గరే వాళ్ళు నాకు తారసపడేసరికి ఒళ్ళు మండిపోయింది. ఇద్దర్నీ కలిపి దులిపేద్దా మనుకొన్నాను. కానీ, ఈ వేళ వాణ్ణి దులిపేస్తే, 'ఓ ఆడదాని ముందు అలా ఇన్సల్ట్ చేయటం ఏమైనా బాగుందిరా ?' అని అడుగుతాడు రేపు. అపుడు సమాధానం యివ్వడం అంత తేలికయిన పనికాదు. అందుకే ఊరుకొన్నాను.

"సారీరా, బ్రహ్మచారిగాడివి. నీ కిబ్బంది ఎందుకని .. "

"అదేమిట్రా ? బ్రహ్మచర్యం వదిలేసి....

"అదే, నాతిగల బ్రహ్మచర్యం...." అంటున్నాడు వీర్రాజు. ఇంతలోనే శకుంతల అంది; 'నేనే వద్దన్నానండి !'

ఆడదానిమాట, అందులోనూ అలాటి సమయంలో ఎంత పవర్ ఫుల్ అయినదో నాకు తెలీందిగాదు. శకుంతల మాట వీర్రాజు పాటించ డంలో తప్పేమీ కనిపించటం లేదు నాకు.

'పోనీండి, ఈ వేళకు క్షమించేయండి....' అంది శకుంతల మళ్లీ.

ఆవిడ అంతగా అడుగుతోంటే మరీ ముఖం మాడ్చుకొని ఉంటే బాగుండదని చిన్న చిరునవ్వు పెదవులమీదకు తెచ్చుకొన్నాను.

'బతికాంరాబాబూ ! పద, కామత్‌కు వెళ్ళి కొంచెం ఉపాహారం.... వీర్రాజు అన్నాడు.

ముగ్గురం కదిలాము. కామత్‌లో అడుగుపెట్టగానే శకుంతల గతుక్కుమంది—వీర్రాజు నవ్వుతూ అన్నాడు - 'మీ బ్రదరని చెప్పు'

నాకర్థంకాలేదు, ఎవరు ఎవరికి బ్రదరో! అడిగాను. అక్కడ కనిపించింది శకుంతల వాళ్ళ ఆఫీసరు. అదీ సంగతి.

మొత్తానికి ఆ దెబ్బతో నేను శకుంతలకు అన్నయ్యనై పోయాను. ఇద్దరి మధ్య అనుబంధంకూడ అలానే పెరుగుతూ వచ్చింది. వీర్రాజుకి కూడ మా ఇద్దరి అనుబంధం అభ్యంతరకరం కాలేదు.

ఆర్నెల్ల తర్వాత అనుకొంటాన్నేను-ఒక రోజున నేను ఆఫీసులో పనిచేసు కొంటున్నప్పుడు నా కోలీగ్ చెప్పాడు-నా కోసం ఎవరో వచ్చారని! ఎవరై ఉంటారా అనే ఆలోచనలతో బయటకొచ్చేసరికి అక్కడున్నది శకుంతల: ఆమె చాలా ఆందోళనగా ఉన్నట్లుంది. ఆమె మనసులోని బాధ ఏదోగానీ ముఖం మీదకూడా కనిపిస్తోనే ఉంది. పలకరింపుగా నవ్వి దగ్గరకెళ్లాను.

'చూడన్నయ్యా— సెలవుపెట్టి రాగలవా ?'—

రాలేనని అనలేకపోయాను. శకుంతలను అక్కడే ఉండమనిచెప్పి, సెక్షన్‌లోకి వెళ్ళి సెలవుపెట్టి వచ్చాను. ఎందుకింత ఆత్రుత పడుతోంది? ఏమై ఉంటుంది ?— బహుశా వీర్రాజుతో ఏదో గొడవ....

—ఉహుం, అయి ఉండదు. కేవలం గొడవే అయితే ఇంత ఆత్రుత అనవసరం.

దగ్గరే ఉన్న హోటల్లోకి తీసుకెళ్ళాను. ఫామిలీరూంలో కూర్చుని కాఫీతాగాక అడిగాను—'చెప్పు, ఏమయింది?'

హేండ్‌బాగ్‌లోంచి ఉత్తరం తీసి అందించింది. చింపి చదివాను—

"శకుంతల గారికి—

ఇది చివరి ఉత్తరం.

ఎందుకో మీకంతా అర్థమయ్యే ఉండాలి, వీర్రాజు."

శకుంతలకు అర్థమయిందో లేదో గానీ, నాకయితే అర్థంకాలేదు. ఉత్తరం మడతపెట్టి అందిస్తూ అడిగాను "ఏమిటిదంతా ?"

"అర్థంకాలేదా ? " అంది శకుంతల నాకేసి అనుమానంగా చూస్తూ.

కాలేదన్నట్లుగా తలఊపాను.

"ఆత్మహత్య చేసుకొన్నాడు–" శకుంతల, కంఠంలో జీర కనిపిస్తోంది.

ఆశ్చర్యపోయాను నేను. అంతే కాదు, నాకు ఇలాటివి అంటే ఒళ్ళుమంట. రాసినదొకటైతే, అర్థంచేసుకొనేది మరొకటి ! దీనివల్ల మనసుల్లో తుఫానులు చెలరేగుతాయంటే చెలరేగవూ మరి. అయినా శకుంతల చెబుతున్నది నిజమేనేమో !

పోస్టువాళ్ళు వేసిన ముద్రచూశాను. నిన్న పోస్టుచేయబడ్డ ఉత్తరం ఇది. ఈ వేళే వీర్రాజు ఆఫీసుకు వచ్చాడో లేదో... అడిగాను.

రాలేదన్నట్లు తలఊపింది శకుంతల.

"సెలవా ?–"

అదీకాదదంది. అసలే ఆఫీసుకు రాలేదు నిన్నా, ఈవేళకూడా !!

నేనూ కొంత భయపడ్డాను. శకుంతల అనేది నిజమేనేమో – ఖర్మ ఒకవేళ అది నిజమేఅయితే, శకుంతల కిప్పుడు ధైర్యంచెప్పాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

"అయితే ఓపని చేద్దాం !–పద, వాళ్ళింటికి వెడదాం !—"

శకుంతల ఆశ్చర్యపోతూ అంది "వాళ్ళింటికా ?, ఇద్దరమూనా ?–"

"ఔను, యిద్దరమూ వెడదాం–"

క్షణం ఆగి అంది శకుంతల, "నేను రాలేను."

"అదేం?—" అడిగాను నేను, శకుంతలను. శకుంతల ఏదో దాస్తోంది. అది మాత్రం నిజం. ఆ దాచేదేదో కూడా చాల పెద్ద విషయమే అయిఉండాలి. అదే వీర్రాజు చావుకు కారణం అయిందేమో....?

నెమ్మదిగా అడిగాను శకుంతలను, "ఒకటడుగుతా, నిజం చెప్పు. గొడవేమైనా జరిగిందా?"

"శకుంతల ఒకసారి తలెత్తి చూసింది. అమె కళ్ళల్లో నీళ్ళు నిండుకొని ఉన్నాయి. అదే ప్రశ్న యింకోసారి అడిగానంటే శకుంతల ఏడవటమనేది స్పష్టం. కానీ అడగక తప్పదు. శకుంతలను అడిగి, ఆగొడవ తెలుసుకోనిదే నేను, వీర్రాజు యింటికి వెడితే అక్కడ ఏమవుతుందో ఏమో....

ఉహూ, కాదు, నేను వెళ్ళితీరాలంటే తెలుసుకొని తీరాలి-తప్పదు!!

"శకుంతలా, చెప్పవేం, గొడవేమైనా జరిగిందా?"

క్షణం ఆగి అంది శకుంతల "దాన్ని గొడవని అనుకోను నేను"

నా కంతా అర్థమయిపోయింది. నెమ్మదిగా అడిగాను—"పోనీ గొడవ కాదు, జరిగినదేమిటో చెబితే...."

బహుశా శకుంతలకు ఆ సంగతి చెప్పడం ఇష్టంలేనట్లుంది. ఆ ప్రశ్నకు జవాబు యివ్వకుండా అంది, "ఇంతకూ వీర్రాజు యింటికి వెళ్ళటం అనేది ఉందో లేదో చెబితే, నేవెళతాను" ఆ కంఠంలో కొంత కాఠిన్యత ఉన్నమాట నిజం.

నాకు, ఆమె ప్రవర్తన చాలా వింతగా తోచింది. తను చేసింది నాకయితే చెప్పదు కానీ, ఆ చేసిందానికి,జరిగిన పరిణామానానికి, నేను, ఆమెకు కొంత సమాధానం చెప్పాలి. సింపతీ పంచాలి- వింత ప్రవర్తన! వింత ప్రవర్తన అనొచ్చునో అనకూడదోగానీ తెలివి తక్కువతనమనిమాత్రం అనొచ్చు. బహుశా ఇలాంటి మొండిప్రవర్తనే

ఏదో దీనికి దారి తీసిఉంటుంది. ఒకవేళ అదే అయితే చాలా ఘోర మైన సంగతి ఇది.

ఆమె పట్టుదలతో సమంగా, నేనూ పట్టుదలవహి స్తే యింకేముంది? ఇద్దరిలో ఎవరో ఒకరు కొంత విచక్షణా జ్ఞానంతో ఉండాలి. లేకపోతే అతడు అనండి, ఆ అనుబంధం అనండి, అది తెగిపోతుంది.

అందుకే నెమ్మదిగా అన్నాను.–"పోనీ నేవెడతాననే అనుకో, కాని అక్కడ పరిస్థితి ఎలా ఉంటుందో ఏమో !—"

"నాకూ అదే భయంగా ఉంది.... ఎలా ఉన్నాసరే, వెళ్ళాలిగదా!"

"వెళ్ళాలిగదా అంటే వెళ్ళాలిమరి"

"అయితే యింకేమీ వద్దు. వెళ్ళిరా ! నా కోసం ప్లీజ్ "

ఇద్దరమూ బయటికొచ్చేశాము. శకుంతలను తిన్నగా యింటికి వెళ్ళమని చెప్పి, బయలుదేరాను నేను వీర్రాజు యింటికి, ఉత్తరంతోసహా.

నేను,వీర్రాజు యింట్లోకి వెళ్ళేసరికి నేనుఆశించినట్లు ఏడుపులులేవ, పెడబొబ్బలు లేవు అసలు ఆయింటిలో కాదు గదా, ఆ పరిసరాల్లోకే చావు తొంగిచూసినట్లు లేదు. ఇల్లంతాచాలా నిశ్శబ్దంగా ఉంది. తలుపు తట్టీతట్ట గానే వీర్రాజు వదినెగారు వచ్చి తలుపుతీశారు. "వీర్రాజు ఉన్నాడా" అని అడిగితే అతనుండే గది చూపించారు. నెమ్మదిగా వెళ్ళాను.

లోపల వీర్రాజు మంచంమీద బోర్లా పడుకుని నిద్రపోతున్నాడు. ఆ గది తుడిచి ఎంతకాలమైందోగానీ, దాదాపొక యాభై సిగరెట్టు పీక లున్నాయి, మంచం చుట్టూరా. ఆ సిగరెట్లు చూస్తుంటేనే ఆ సిగరెట్లు కాల్చినవ్యక్తి చాల బాధపడ్డట్లు, మానసికమైన రోగంలో ఉన్నట్లూ తెలుస్తుంది.

ఒక్కటిమాత్రం నిజం, వీర్రాజు చావలేదు !!

అంటే చావబోయి చావలేదా ?

లేకపోతే అసలు చావనేలేదా ?

తెలీదు.

మంచంమీద కొంచెం చోటు చూసుకొని కూర్చుని నెమ్మదిగా వీర్రాజును తట్టి పిలిచాను. "రాజూ ...రే, రాజూ!"

వీర్రాజు కదిలాడు. రెండోసారి తట్టేసరికి లేచాడు–"నువ్వా ? ఎవరా అనుకొన్నాను!"

నాకు నవ్వొచ్చింది. ఎవరో అనుకున్నాడట! ఎవరోఅని అను కోవటమేంఖర్మ. శకుంతల అనుకున్నారా అనలేకగానీ!!

"ఏమిటి సంగతులు ?"అన్నాడువీర్రాజుసిగరెట్టుపెట్టెఅందుకొంటూ

"ఏమున్నాయి, నువ్వు చెప్పు దీనికి అర్థం ఏమిటో?" అంటూ శకుంతలకు వాడు రాసిన ఉత్తరం అందించాను.

వాడు ఆ ఉత్తరం అందుకోలేదు. నవ్వుతూ అన్నాడు, "గుడ్! కథ అనుకొన్నట్లే జరుగుతున్నదన్న మాట. గుడ్! నీ దగ్గర కెప్పుడొచ్చింది ?"

వాడి నవ్వుకు నాకు ఒళ్ళు మండి పోయింది. "నీ కేమో నవ్వు లాటగాఉంది. కానీ అవతలవాళ్ళ పరిస్థితి ఊహించగలిగే వాడివైతే, ఇలాటి వెధవ్వేషాలు వెయ్యలేవు, తెలుసా ?"

"ఏమిట్రా అవతలవాళ్ళ పరిస్థితి ? నేనది ఊహించలేదనుకోను."

క్షణం ఆగి అడిగాను—"అయితే ఏమిటి ఈ ఉత్తరానికి అర్థం?"

సిగరెట్టు పొగను రింగులు రింగులుగా వదులుతూ, విలాసంగా అన్నాడు వీర్రాజు — "నిజం చెప్పాలంటే ఆ ఉత్తరం ఒక ప్రశ్న. శకుంతలకు ఒక పరీక్ష"

"శీల పరీక్షా ?"

నవ్వాడు వీర్రాజు గట్టిగా ! మంచి పేరు పెట్టావు. శీలపరీక్షే అది! కాదనను !"

ఇది యుగయుగాలుగా జీర్ణించుకుని పోయిన మగలక్షణం. శీల పరీక్షట ! శీల పరీక్ష ! ! వీర్రాజుకున్న శీలం ఏమిటో నాకు తెలీంది గాదు. ఆ గాడిదకు శీలపరీక్ష పెట్టె హక్కు.....నాన్సెన్స్ - నాకు భలే కోపంగా ఉంది లేస్తూ అన్నాను "నేను వెడుతున్నాను"

"అదేమిట్రా ? కారణాలు అడగకుండానే వెడతానంటావేం ? "

"కారణాలు నా కనవసరం"

"కానీ చెప్పటం నాకు అవసరం. నేను అడిగినా అడగకపోయినా నువ్వు మళ్ళీ శకుంతల దగ్గరకు వెళ్ళి తీరతావు. అలాంటి పరిస్థితిలో కారణాలు నువ్వు తెలుసుకొని తీరాలి !"

కారణాలు వినాలనే కుతూహలం నాను లేకపోలేదు. అందుకే అయిష్టతను ప్రదర్శిస్తున్నట్లుగ అన్నాను— "త్వరగ చెప్పి ఏడు ! !"

"అలా అన్నావ్ బాగుంది ! ఒరే. ఒకటడుగుతా జవాబు చెప్పు, రెండు హృదయాలు ఒకటవ్వాలంటే ముఖ్యంగా కావాల్సింది ఏమిటి ?"

"ఇది నాకు పరీక్షా ?ఇలాటి చచ్చుప్రశ్నలు నన్నడగకు. ప్రశ్నా, జవాబూ రెండూ నువ్వే చెప్పు—"అన్నాను చిరాకు ప్రదర్శిస్తూ.

"సరే నేనే చెబుతాను. ముఖ్యంగా కావాల్సింది నమ్మకం ! మా ఇద్దరిలోనూ అది దాదాపు కొరవడినట్లే. ఇద్దరిలో అనడంకన్నా శకుంతల లోనే అనడం అక్షరాల రైటు."

అసలేం జరిగిందో చెప్పు "

"మొన్న అంటే ఐదురోజుల క్రితం నేనూ శాంతా సినిమాకు వెళ్ళాంరా !"

"శాంతెవరు:"

"అలా అడిగిఉంటే బాగుండేది. కానీ శకుంతల ఎలా అడిగిందో తెలుసా ? "కొత్త పిట్ట ఎవరు ? " అని అడిగింది. నాకు ఒళ్ళుమండింది.

శాంత నాకు చిన్నప్పుడు ఎప్పుడో క్లాస్‌మేట్. ఈ ఊరికి వచ్చిందట ఇంటర్వ్యూకి. సినిమాకు వెడుతోంటే నన్ను గుర్తుపట్టింది సరదాగా సినిమాకు వెళ్దాంరా అంటే వెళ్ళాను.—ఇదయ్యా నేను చేసిన క్షమించరాని నేరం"

"నిజంగా ఇంతే జరిగిందా ?"

"జరిగింది ఇదే! కానీ శకుంతలకు ఇది గొప్ప నేరంగా కనిపించింది. నువ్వు నా డియరెస్టు ఫ్రెండ్‌విగదా ! నీతో నిజం చెబుతా ! "సినిమా బాగుందా" అని అడిగిందిరా ముందు. "బాగానే ఉందన్నా". శకుంతల ఏమందో తెలుసా ? "ఔన్లే, పక్కనే శాంత ఉందన్నావుగా ! హీరోయిన్ పక్కనే ఉంటే హీరోకి సినిమా ఎందుకు బాగుండదూ?" అంది. నేను నవ్వేశాను— శకుంతల నవ్వలేదు. కళ్ళు ఇంతలు చేసుకొంటూ ఏమందో తెలుసా ? " యిలా అయితే జన్మలో నీ ముఖం నాకు చూపించకు. నువ్వొత్త మోసకారివి. నువ్వొత్త దొంగవు. నువ్వో రాస్కెల్‌వి". ఇంకే మంటాను ? నెమ్మదిగా అన్నాను నేను "పోనీలే అలా అయితే ! బతికుంటే నా ముఖం నీకు కనబడే తీరుతుంది. అయినా సరే నా ముఖం నీకు కనిపించ నివ్వను—సరేనా !" అంటూ బయట కొచ్చాను నేను. మనిషికి ముఖ్యంగా ఆడదానికి ఇంత పొగరుకూడదు. ఎదుటివాడు చెప్పేది వినాలి అనేది కనీసధర్మం. వినను - నా యిష్టం అంటే నీ యిష్టమే, పోయి గంగలో దిగు. నువ్వు దిగకపోతే నేను దిగుతాను. ఇంతే రాయాలనుకొన్నాను. ఇంతరాయటం దండగని రెండు ముక్కలే రాశాను... ఇంతే సంగతులురా !" అన్నాడు వీర్రాజు.

నాకు నవ్వొచ్చింది—చిన్న చినుకులు. కానీ చిలికి చిలికి గాలివాన అవదుగదా !

"ఈ మాత్రానికే ఉత్తరం రాయాలిట్రా ?"

"ఉత్తరం రాయటానికి కారణం లేకపోలేదు. ఈ ఉత్తరం చది వాక నైనా నా దగ్గరకు రావాలిగదా? రాలేదు-అంటే ఏమిటో తెలుసా? ఆ మనిషికి ఇంకా ఆ పొర విడలేదని అర్థం"

"కానీ శకుంతల నువ్వు చచ్చిపోయావని అనుకొంటోందిరా!"

"అలా అనుకున్నాసరే, తను రావాలి. రాలేదు... అయినా నేను అలాగ రాయలేదు. తనలా అర్థంచేసుకొంటే ఆ బాధ్యత నాదిగాదు"

నాకు ఇది తమాషాగా ఉంది. ప్రణయ కలహం! అంతే!!

ఇలాటి వాటిల్లో జోక్యం కలిగించుకోలేదు కూడాను!! వారం రోజుల తర్వాత నాకు బెజవాడకు ట్రాన్స్ఫర్ అయిపోయింది, ఒకసారి శకుంతలవాళ్ళ ఇంటికి వెడితే శకుంతలవాళ్ళ ఇల్లు తాళంవేసి ఉంది. వీర్రాజు ఇంట్లోలేడు.

నేను బెజవాడకు వచ్చేశాను.

ఆ తర్వాత ఇన్నాళ్ళకు ఈ శుభలేఖ.

వెళ్ళాలని లేకపోయినా వెళ్లాను — నాకోసం వేచి ఉండేవాళ్ళ ఎవరూ లేరనిపించినా! నా రాక కోరేవాళ్ళు లేరని పించినా!!

కానీ అక్కడ నాకోసం కాచుకున్నది ఇద్దరున్నారు -- ఒకరు శకుంతల. మరొకరు వీర్రాజు!!

శకుంతల అక్కడ పెళ్ళిపీటలమీద ఉండాల్సిన వ్యక్తి. పెళ్ళికి ఆధిపత్యం వహిస్తోంది. నవ్వొచ్చింది. ఆ తర్వాత బాధ కలిగింది, శకుంతలను అడగాలి, అసలు ఏం జరిగిందో!

పెళ్ళయిపోయాక శకుంతల తనంతట తానే నా దగ్గర చేరింది — "ఏమిటన్నయ్యా, ఏమిటి సంగతులూ" అంటూ.

మొదట నవ్వాను– ఆ తర్వాత అడిగాను– "కథ చెప్పాల్సింది నువ్వు. అసలేం జరిగిందో?"

"పారిపోయిన పెద్దమనిషివి నువ్వు. నీకు చెప్పాలిగదూ!"

నాకు తల కొట్టేసినంత పనయింది – "అదిగాదు...."

" నీ సంజాయిషీ వద్దులే, నీ పరిస్థితి నేనర్థం చేసుకోగలను."

"అసలేం జరిగిందో చెప్పు...."అని అడిగాను నేను, బతికానురా బాబూ అనుకొంటూ.

"అబద్దమనుకోకు ఆ రోజు నువ్వు రాకపోయేసరికి వీర్రాజు నిజంగానే చచ్చిపోయాడనుకున్నాను నేను. వీర్రాజు తప్పులేదనే అనిపించినా, అతన్ని ఆపరిస్థితికి తోసింది నేనే! అందుకే నాకూ చద్దామనిపించింది కానీ చావలేక పోయాను. హాస్పిటల్లో నన్ను బతికించారు. వీర్రాజూ నా పక్కనే ఉన్నాడప్పుడు. నేను మళ్ళీ బతికినపుడు ముందు చూసింది వీర్రాజునే! అపుడే అనుకొన్నా, మేమిద్దరం దంపతులము కాలేము అని, అతనంటే నాకునమ్మకం లేదనుకొన్నాడు వీర్రాజు. వీర్రాజు గురించి నాకు తెలిసినంతగ ఎవరికీ తెలీదు. అందుకే అంతగా అడిగాను "సినిమా ఎలా ఉందని". మొదటిసారి నాతో సినిమాకు వచ్చినపుడేం చేశాడో నీకు తెలీదు! పోనీలేకానీ, అతని మీద నాకు నమ్మకం అపుడు చావలేదుగానీ ఆ తర్వాత చచ్చిపోయింది. చావంతటి ప్రాక్టికల్ జోకు నా మీద కట్ చేశాడు. అందుకే నాకు ఒళ్ళు మండిపోయింది. అతనిలాగే నేనూ ఉత్తరం రాశాను అతనికి 'నీకు నాకూ రాంరాం'అని! "నీతో పెళ్ళి నాకు ఇష్టం లేదు. ఇంతే సంగతులు " శకుంతల చెప్పటం ఆపింది.

నా కున్న ముఖ్యమైన ప్రశ్న అడుగుదామనిపించింది — ఇంతకి ఒకటడగనా ?"

"అడుగు"

"మొదటి సారి సినిమాకు వెళ్ళినప్పుడు వీర్రాజు ఏం చేశాడు? "

శకుంతల పకపకా నవ్వింది – నేను మళ్ళీ అడిగాను 'చెప్పవేం?'

"ఏంచెప్పను ? కొన్ని ప్రశ్నలే ఉంటాయి. ఆ ప్రశ్నకు నీ ఇష్టంవచ్చిన జవాబు ఊహించుకోవచ్చు— ఔనా ? — ఇదీ అంతే—"

నాకు కొంత అర్థమైంది. మళ్ళీ అడిగాను "సరిగా చెప్పు ! "

"సరిగా చెప్పాలంటే.... నువ్వొత్త ఫూల్‌వి ! " అంది శకుంతల.

నాకు అంతా అర్థమైపోయింది - వీర్రాజును శకుంతల పెళ్ళి చేసుకోవాల్సిన అవసరం కనిపించలేదు నాకు ! !

[యువ—నవంబర్ 72]